

27న తపాలా అదాలత్

అరసవల్లి, సెప్టెంబరు 13: వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న ఉదయం 11.30 గంటలకు పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం(విశాఖ)లో తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలోని వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈ నెల 23లోగా '115వ తపాలా అదాలత్' అనే శీర్షికతో 'కేవీడీ సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విశాఖ- పిన్ 530017' అనే చిరునామాకు పంపాలని కోరారు.

యూరియా.. ఏదయా?



- ఆర్బీకేల్లో నిండుకున్న ఎరువుల నిల్వలు
- ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్న రైతులు
- అధిక ధర వసూలు చేస్తున్న వ్యాపారులు
- జింక్, పొటాష్ కూడా కొనాలని షరతులు

(నరసన్నపేట)

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలతో అల్లాడిపోయిన అన్నదాతలకు.. ఎరువుల కోసం కూడా ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో 3,41,775 ఎకరాల్లో వరి సాగు చేశారు. రైతుభరోసా కేంద్రాల్లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు సుమారు 25,155 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు. వీటిలో యూరియా కేవలం 17వేల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఎకరా వరి సాగుకు మూడు విడతల్లో 50 కేజీల వరకూ యూరియా వినియోగిస్తారు. ఈ లెక్కన జిల్లాలో సాగుకు సంబంధించి 35వేల మెట్రిక్ టన్నుల వరకూ యూరియా అవసరం కాగా.. రైతుభరోసా కేంద్రాల్లో అరకొరగానే పంపిణీ చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదాహరణకు నరసన్నపేట మండలంలో సుమారు 7వేల ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా.. యూరియా 589 మెట్రిక్ టన్నులు, డీఏపీ 220 మెట్రిక్ టన్నులు, గ్రోమోర్ 10 మెట్రిక్ టన్నులు మాత్రమే ఆర్బీకేలకు పంపిణీ చేశారు. రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఆర్బీకేల్లో ఉండడం లేదు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించగా.. ఇదే అదనుగా వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఆర్బీకేలో 45 కేజీల యూరియా బస్తా రూ.275కు విక్రయించగా.. ప్రైవేటు దుకాణాల్లో వ్యాపారులు రూ.330 నుంచి రూ.350 వరకూ వసూలు చేస్తున్నారు. పైగా యూరియా కావాలంటే.. జింక్, దుబ్బుగుళికలు, పోటాస్ తదితర కాంప్లెక్స్ ఎరువులను కొనాల్సిందేనని షరతు పెడుతున్నారు. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో జలుమూరు, పోలాకి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి తదితర మండలాలకు చెందిన రైతులు నరసన్నపేట వచ్చి యూరియాను కొనుగోలు చేస్తున్నారు.

- జలుమూరు మండలం కూర్మనాథపురానికి చెందిన మొయ్య అప్పన్న ఇటీవల నరసన్నపేటలో ఒక ఎరువుల దుకాణం వద్దకు వెళ్లాడు. యూరియా, డీఏపీ కావాలని అడగ్గా.. తన వద్ద స్టాక్ లేదని షాపు యజమాని చెప్పాడు. కేవలం 20.20.0.13 రకాలు ఉన్నాయంటూ.. అవసరం లేని వాటిని అంటగట్టి విక్రయించాడు.
- పోలాకి మండలం ఈదులవలసకు చెందిన ఒక యువ రైతు యూరియా కోసం నరసన్నపేటలో ఎరువుల దుకాణానికి వెళ్లాడు. జింక్, గుళికలు కొనుగోలు చేస్తేనే.. యూరియా, డీఏపీ ఇస్తామని షాపు యాజమాని చెప్పాడు. దీంతో చేసేది లేక జింక్, గుళికలు కూడా ఆ రైతులు కొనుగోలు చేయాల్సి వచ్చింది.

గిడ్డంగుల్లో దించి...

ఒక్కో దుకాణానికి వారం రోజులకోసారి లారీ లోడ్ యూరియా వస్తుంది. దీన్ని దుకాణాల్లో కాకుండా గొడౌన్‌లలో దించి.. స్టాక్ లేదని వ్యాపారులు బుకాయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. షాపుల వద్ద నిల్వలు ఉంచకుండా కొందరు ట్రేడర్స్ అనుమతి లేని గొడౌన్లలో నిల్వ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. సహకార సంఘాల్లో కూడా యూరియా తెప్పించలేదని పేర్కొంటున్నారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి.. పూర్తిస్థాయిలో ఎరువులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్‌బీకేలలో లేదు



రైతు భరోసా కేంద్రాల్లో యూరియా దొరకడం లేదు. వరిపైరు ఎదుగుదల కోసం యూరియా అవసరం. యూరియా కోసం స్థానిక దుకాణాలకు వెళితే.. కాంప్లెక్స్ ఎరువులు కొంటే ఇస్తామని.. లేదంటే అధిక ధరలకు చెల్లించాల్సిందేనని చెబుతున్నారు.

-యాళ్ల వేణుగోపాలరావు, మాకివలస, రైతు

పట్టించుకోవడం లేదు



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి రైతులకు అన్నీ కష్టాలే. మొదటిల్లో వర్షాలు లేక, వంశధార కాలువల్లో నీరు సక్రమంగా అందక పంటలు ఎండిపోతున్నాయి. పదిహేను రోజులుగా వర్షాలు పడతున్నాయి. ఎరువు వేద్దామన్న సమయంలో యూరియా అందుబాటులో లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. ఆర్బీకేల్లో ఎరువులు దొరకడం లేదు. అధికారులు స్పందించి తగినంత యూరియా అందించాలి.

-వాన గోవిందరాజులు, రైతు, జమ్ము

బ్లాక్‌లో విక్రయిస్తే చర్యలు

యూరియాను బ్లాక్‌లో విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకు రైతుభరోసా కేంద్రాల్లో అవసరం మేరకు యూరియాను నిల్వ చేసి విక్రయించాం. యూరియా కొరత లేకుండా ఇండెంట్లు పెట్టి ఆర్బీకేలకు పంపిణీ చేస్తాం.

- రవీంద్రభారతి, ఏడీఏ, నరసన్నపేట

అడిగినంత ఇవ్వడం లేదు

హోల్‌సేల్ డీలర్లు అడిగినంత యూరియా ఇవ్వడం లేదని వ్యాపారులు అంటున్నారు. గతంలో యూరియాను దుకాణాల వద్దకు తెచ్చి డెలివరీ ఇచ్చేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. రూ.30 రవాణా చార్జీ, రూ.5 హమాలీ ఖర్చుతో తమకు ఒక్కో బస్తా రూ.340కు వస్తోందని తెలిపారు. దీనిపై కనీసం రూ.10 లాభం వేసుకుని బస్తాను రూ.350 విక్రయిస్తున్నామని చెబుతున్నారు. ఈ ధరలు రైతులు చెల్లించడం లేదని, అందుకే యూరియా స్టాక్ తీసుకురావడం లేదని పేర్కొంటున్నారు.

ఆ రోడ్డులో ప్రయాణం.. నరకమే



మట్టి రోడ్డులో కూరుకుపోయిన లారీలు

- శ్రీకాకుళం- ఆమదాలవలస మార్గంలో కూరుకుపోయిన లారీలు
- మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం

శ్రీకాకుళం రూరల్/ఆమదాలవలస, సెప్టెంబరు 13: శ్రీకాకుళం మండలం కొత్తరోడ్డు నుంచి ఆమదాలవలస వెళ్లే మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఆ రోడ్డులో ప్రయాణించే వాహనాలతో పాటు మనుషుల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రహదారి నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో.. ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. పనుల్లో భాగంగా మట్టితో గుంతలు పూడ్చింది. ఇంతలో ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. దీంతో పరిస్థితి షరామామూలైంది. మళ్లీ ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడగా.. మట్టి రోడ్డులో వాహనాలు కూరుకుపోతున్నాయి. శుక్రవారం వేకువజామున 4 గంటల ప్రాంతంలో ఆమదాలవలస వైపు వెళ్తున్న మూడు ఇసుక లారీలు మట్టి రోడ్డులో కూరుకుపోయాయి. స్థానికుల సాయంతో వాహనాలను ముందుకు నెట్టేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో ఉదయం 7గంటల వరకూ కొత్తరోడ్డుకు ముందు ఉన్న గెడ్డకు ఇరువైపులా వాహనాల రాకపోకలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పెద్దపాడు ఎస్‌ఐ వాసుదేవరావు, ఆమదాలవలస పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ల సాయంతో వాహనాలు బయటకు లాగి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. కాగా ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యంగా మారాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళ.. వాహనాల రద్దీతో ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొంటున్నారు. భారీ వాహనాల రాకపోకలతో ఈ రోడ్డులో ఉన్న కల్వర్టులు కుంగిపోయాయని చెబుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నిలిచిన వాహనాలు

పించన్‌దారులకు ఊరట

- రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా నగదు తీసుకోవచ్చు
- తాత్కాలిక బదిలీకి అవకాశం

(మెళియాపుట్టి)

సామాజిక పింఛన్ లబ్ధిదారులకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పింఛన్ తీసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఎన్నికల్లో సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ తాత్కాలిక బదిలీకి కొత్త ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇకపై లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ పింఛన్ తీసుకోవచ్చు. కాగా.. పింఛన్ బదిలీ చేయాలనుకుంటున్న వారు.. సచివాలయాలకు వెళ్లి ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. తాము కోరుకున్న చోటుకు తాత్కాలికంగా బదిలీ చేసుకుని పింఛన్ పొందవచ్చు. ప్రతి నెలా ఈ ఆప్షన్ అందుబాటులో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీంతో పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర సామాజిక పింఛన్‌దారులు 3,47,798 మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం ప్రతినెలా సుమారు రూ.83.72 కోట్లు పింఛన్ల రూపంలో నగదు అందజేస్తోంది. 2014-19 మధ్య టీడీపీ హయాంలో ఒక నెలలో పింఛన్ తీసుకోకపోయినా.. మరుసటి నెల పింఛన్‌తో కలిపి ఆ డబ్బులు లబ్ధిదారులకు అందజేసేవారు. అలాగే పోర్టబులిటీ విధానం ద్వారా రాష్ట్రంలోని ఏ సచివాలయంలోనైనా పింఛన్ డబ్బులు పొందే అవకాశం ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్‌దారులకు కష్టాలు మొదలయ్యాయి. ఏ నెల పింఛన్ డబ్బులు ఆ నెల మాత్రమే అందించేది. పోర్టబులిటీ విధానాన్ని కూడా రద్దుచేసింది. దీంతో దూర ప్రాంతాల్లో ఉన్న పింఛన్‌దారులు ప్రతినెలా స్వగ్రామాలకు వచ్చేందుకు నానా పాట్లు పడేవారు. ఒకవేళ సకాలంలో అందుబాటులో లేకపోతే ఆ నెల పింఛన్ డబ్బులు పోయినట్టే. తర్వాత నెల నుంచి కొంతమంది పింఛన్లు కూడా రద్దయ్యేవి. తమ కష్టాలను గుర్తించి.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పింఛన్ తాత్కాలిక బదిలీకి అవకాశం కల్పించడంతో చాలామంది లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యం బాగోలేక సుదూర ప్రాంతాల్లో పిల్లలు వద్ద నివసిస్తున్నవారు.. ఇకపై తమకు ప్రయాణకష్టాలు తప్పుతాయని, ఆర్థిక భారం కూడా తగ్గుతుందని ఊరట చెందుతున్నారు.

డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- జీజీహెచ్‌లో పూర్తిస్థాయి డి-అడిక్షన్ కేంద్రం సేవలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కన ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 13: సిక్కోలును డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా భాగస్వామ్యం కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ కెవి.మహేశ్వరరెడ్డితో కలిసి జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో గంజాయి, ఇతర డ్రగ్స్ వాడకాన్ని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'మాదకద్రవ్యాల వినియోగం, వాటికి సంబంధించిన ఫిర్యాదుల నమోదు, డి-అడిక్షన్ కేంద్రాల సేవలకు గాను టోల్‌ఫ్రీ నెంబరు 14446ను సంప్రదించాలి. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్-రిమ్స్)లో డి-అడిక్షన్ సెంటర్‌ను పూర్తిస్థాయిలో నిర్వహిస్తాం. జిల్లాలోని రంగస్థల కళాకారులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, ఎన్జీవోల సహకారంతో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడతామ'ని తెలిపారు. ఎస్పీ కెవి.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. గంజాయి విక్రయాలు, వినియోగం జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది గంజాయి విక్రయిస్తున్న 50 మందిపై సస్పెక్ట్ షీట్, ఏడుగురిపై రౌడీ షీట్ తెరిచామన్నారు. యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి, 187 కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ ఏడాది ఇంతవరకు 391 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, 17మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. గంజాయి వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయం ఎంతో అవసరమన్నారు. సమావేశంలో ఆర్డీవోలు సీహెచ్.రంగయ్య, భరత్ నాయక్, డీఎస్పీలు సీహెచ్.వివేకానంద, శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్, డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, అటవీశాఖ, డ్రగ్ కంట్రోల్, విద్యాశాఖ, పోలీసు ఇన్‌స్పెక్టర్లు, రవాణా, ఆర్టీసీ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఘనంగా హిందీ దివస్

హిందీ దివస్‌ను పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఇచ్ఛాపురం మండలం ఈదుపురం, కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు వినూత్న ప్రదర్శనలు చేపట్టారు. కొళిగాం ప్రధానోపాధ్యాయుడు నరేంద్రకుమార్ పట్నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులు హిందీ 'అ, ఆ'.. అక్షరమాల రూపం ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. హిందీ ఉపాధ్యాయులను సాలువలతో సత్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేశారు.

- ఇచ్ఛాపురం



నర్సింగపల్లిలో రెండేళ్లుగా ప్రారంభోత్సవానికి నోచుకోని రైతుసేవా కేంద్రం



నర్సింగపల్లిలో అసంపూర్తిగా వెల్‌నెస్ సెంటర్

అప్పుడు బిల్లులు.. చెల్లించక..!

- ఏళ్లు గడిచినా పూర్తికాని ప్రభుత్వ భవనాలు
- జిల్లాలో అసంపూర్తిగా నిలిచిపోయినవి 626
- కొన్నిచోట్ల పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోని వైనం

(టెక్కలి)

జిల్లాలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలకు, రైతుభరోసా కేంద్రాలకు, వెల్‌నెస్ సెంటర్లకు, డిజిటల్ లైబ్రరీ, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పు కొచ్చింది. కాగా.. గత ఐదేళ్లలో డిజిటల్ లైబ్రరీ, బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు నిర్మాణంలో పూర్తిగా విఫలమైంది. జిల్లాలో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు.. 1,453కు గానూ 827చోట్ల నిర్మాణాలు చేపట్టింది. జిల్లావ్యాప్తంగా 626 భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేసింది. 289 రైతు భరోసా కేంద్రాలు, 394 సచి వాలయాలు, 144 వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం పూర్తయినా చాలాచోట్ల ప్రారంభానికి నోచుకోలేదు. కొన్నిచోట్ల వీటి నిర్మాణాలకు పలువురు కాంట్రాక్టర్లు ముందుకురాని పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టర్లపై జీఎస్టీ భారంతో పాటు 2019-20 అంచనా వ్యయం ప్రకారం ఇసుక, ఇనుము, సిమెంట్, చిప్స్, ఇతరత్రా సామగ్రి ధరలు చెల్లింపులు వారికి తడిసిమోపెడవుతున్నాయి. 2019లో అప్పటి ధరలను పరిగణనలోకి తీసుకుని గత ప్రభుత్వం భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. గత నాలుగేళ్లలో నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగాయని.. ఈక్రమంలో పనులు చేపడితే తమకు నష్టాలు తప్పవంటూ కాంట్రాక్టర్లు జాప్యం చేశారు. దీంతో జిల్లాలో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లకు సంబంధించి మొత్తం 626 భవనాల పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి.

- టెక్కలి మండలంలో బొప్పాయిపురం, లింగాలవలస, నర్సింగపల్లి, తొలుసూరుపల్లి, టెక్కలి-1 ప్రాంతాల్లో రైతు సేవా కేంద్రాలు నిర్మించి రెండేళ్లయినా ప్రారంభానికి నోచుకోలేదు. ఇక పునాదులు, శ్లాబ్, అసంపూర్తి నిర్మాణాలతో మరో ఎనిమిది చోట్ల రైతుసేవా కేంద్రాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.
- టెక్కలి మండలంలో గ్రామ, వార్డు సచివాలయాలను పరిశీలిస్తే.. నర్సింగపల్లి, అయోధ్యపురం, బొప్పాయిపురం, గూడేం, పాతనౌపడా, టెక్కలి-1, 2, గోపినాధపురం ప్రాంతాల్లో అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి. పోలవరం, చాకిపల్లి, లింగాలవలస సచివాలయాలు ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తున్నాయి.
- టెక్కలి మండలంలో పోలవరం, లింగాలవలస, చాకిపల్లిలో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం పూర్తయినా.. ప్రారంభించలేదు. నర్సింగపల్లి, అయోధ్యపురం, బొప్పాయిపురం, గూడేం, పాతనౌపడా, టెక్కలి-1, 2 ప్రాంతాల్లో వెల్‌నెస్ సెంటర్లు అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి.


● పనులు పూర్తయినా..

గత వైసీపీ ప్రభుత్వం ఒక్కో రైతుభరోసా కేంద్రం నిర్మాణానికి రూ.21.80 లక్షలు మంజూరు చేసింది. అలాగే సచివాలయ నిర్మాణానికి రూ.40లక్షలు చొప్పున, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి రూ.17.50 లక్షలు చొప్పున కేటాయించింది. కాగా ఈ నిధులు చాలవని కాంట్రాక్టర్లు పేర్కొనడంతో అదనంగా రైతుభరోసా కేంద్రానికి రూ.2.05 లక్షలు, సచివాలయానికి రూ.3.50 లక్షలు, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి రూ.3.30 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసింది. మొదట్లో బిల్లులు రావడంతో చకచకా భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. తర్వాత బిల్లులు సక్రమంగా చెల్లించలేదు. దీంతో చాలాచోట్ల పనులు పూర్తయినా.. ఈ ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి నోచుకోక పోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కూడా ఇరుకు భవనాల్లోనే విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుభరోసా కేంద్రాలను.. రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. కాగా.. నిర్మించిన భవనాల వద్ద ఇంకా పేర్లు మార్చలేదు. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోవడంతో రంగులు వెలసి చెదలు పట్టేస్తున్నాయి. పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. అలాగే అసంపూర్తి భవనాల నిర్మాణాలపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. ఈ విషయమై టెక్కలి డివిజన్ పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాష్ వద్ద ప్రస్తావించగా భవనాల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు.

రైతు సేవా కేంద్రాలు	:	494
పూర్తయినవి	:	289
వివిధ దశల్లో నిర్మాణాలు	:	205
గ్రామ, వార్డు సచివాలయాలు	:	602
పూర్తయినవి	:	394
వివిధ దశల్లో నిర్మాణాలు	:	208
వెల్‌నెస్ సెంటర్లు	:	357
పూర్తయినవి	:	144
వివిధ దశల్లో నిర్మాణాలు	:	213

డా.ఎన్టీఆర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో నర్సింగ్ కోర్సులు



విజయవాడలోని డా.ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డా.ఎన్టీఆర్ యూహెచ్ఎస్)- బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ కోటా కింద ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో మొత్తం సీట్లు; ప్రైవేట్ అన్ ఎయిడెడ్ మైనారిటీ, నాన్ మైనారిటీ నర్సింగ్ కాలేజీల్లో 60 శాతం సీట్లు అలాట్ చేస్తారు. ప్రతి ప్రోగ్రామ్‌లో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. మిగిలిన 15 శాతం సీట్లకు స్థానికులు సహా స్థానికేతర అభ్యర్థులందరూ పోటీ పడవచ్చు. వెబ్ కౌన్సెలింగ్ నాటికి సీట్ల వివరాలు ప్రకటిస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. దీనిలో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; ఇంటర్ ఒకేషనల్‌తోపాటు బయలాజికల్ అండ్ ఫిజికల్ సైన్సెస్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏఐఎస్ఎస్‌సీఈ/ఐసీఎస్ఈ/ఎస్ఎస్‌సీఈ /హెచ్ఎస్‌సీఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సైన్స్ సబ్జెక్టుల్లో జనరల్ అభ్యర్థులకు 45 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. ఏపీఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. జనరల్ కేటగిరీలో(దివ్యాంగులు సహా) 40382లోపు; ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల్లో 48459లోపు ర్యాంక్ సాధించిన వారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.

పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన బోర్డు/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్ నుంచి ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కోర్సు పూర్తిచేసి స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు పొందినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏడాదిన్నర వ్యవధి గల ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024డిసెంబరు 31 నాటికి 21 ఏళ్లు నిండి ఉండాలి. అకడమిక్ మెరిట్, జీఎన్ఎం మార్కుల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2360; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1888
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)కి చెందిన మధురై రీజనల్ సెంటర్- డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ ఐ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, తమిళం మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌నకు న్యూఢిల్లీలోని రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉంది. అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు. దివ్యాంగులకు, దివ్యాంగుల తల్లిదండ్రులకు ఇన్‌స్టిట్యూషనల్ ఫీజు ఉండదు. దివ్యాంగుల తోబుట్టువులకు 75 శాతం ఫీజు రాయితీ లభిస్తుంది. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.200; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

రామానుజం నేషనల్ మేథ్స్ ఛాలెంజ్



ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్(ఏఐసీటీఎస్‌డీ)- 'రామానుజం నేషనల్ మేథ్స్ ఛాలెంజ్(ఆర్ఎన్ఎంసీ) 2025'కు దరఖాస్తులు కోరుతోంది. మేథ్స్‌లో నేటి తరం విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు గాను 'నేషనల్ మేథ్స్ స్కాలర్-2025' కాన్సెప్ట్‌తో ఈ పోటీని నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు మేథమెటిక్స్‌కు సంబంధించి ఆన్‌లైన్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా నాలుగోతరగతి నుంచి పన్నెండోతరగతి చదివే విద్యార్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మేథమెటిక్స్‌లో ఆసక్తి ఉన్నవారు జాతీయ స్థాయిలో తమ స్కిల్స్ ప్రదర్శించేందుకు ఇది సదవకాశం.

ఆన్‌లైన్ ఎగ్జామ్ వివరాలు: అభ్యర్థులు ఇంటి వద్దనే ఆన్‌లైన్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇందులో 30 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున మొత్తం మార్కులు 60. రుణాత్మక మార్కులు ఉన్నాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఎగ్జామ్ తేదీ, టైం స్లాట్, ఆన్‌లైన్ ఎగ్జామ్ లింక్ తదితరాలను విద్యార్థుల మొబైల్‌కు ఎస్ఎంఎస్ ద్వారా పంపుతారు.

- నాలుగు నుంచి పన్నెండు వరకు ప్రతి తరగతికీ నిర్దేశించిన ఎగ్జామ్ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.


రివార్డ్‌లు: పరీక్షలో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వీరిలో ముగ్గురిని విజేతలుగా ప్రకటిస్తారు. మొదటి బహుమతి కింద రూ.75,000; ద్వితీయ బహుమతి కింద రూ.50,000; తృతీయ బహుమతి కింద రూ.25,000; రన్నరప్‌లుగా నిలిచిన 50 మందికి ఒక్కొక్కరికి రూ.2000; అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 100 మందికి ఒక్కొక్కరికి రూ.500ల నగదు ఇస్తారు. విజేతలందరికీ జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న ఏఐసీటీ ఎస్‌డీ సర్టిఫికెట్, నేషనల్ మేథ్ స్కాలర్ ట్రోఫీ అందిస్తారు. సంస్థ అంతర్జాతీయంగా నిర్వహించే వివిధ ప్రాజెక్టులు, టెక్నికల్ ఈవెంట్లు సహా పలు సెమినార్లలో నేరుగా పాల్గొనే అవకాశం కల్పిస్తారు. నేషనల్ మేథమెటిక్స్ సైంటిస్ట్ స్కాలర్‌షిప్ కూడా లభిస్తుంది. రోబోటిక్స్ ఆటోమేషన్ అండ్ కోడింగ్‌లో ట్రెయినింగ్ ఇస్తారు. ప్రథమ బహుమతి విజేతకు ఏడాది, ద్వితీయ బహుమతి పొందినవారికి ఆరు నెలలు, తృతీయ బహుమతి సాధించినవారికి మూడు నెలలు శిక్షణ ఇస్తారు. పోటీలో పాల్గొన్నవారందరికీ సంస్థ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇస్తుంది.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.270
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **ఆన్‌లైన్ ఎగ్జామ్ తేదీ:** డిసెంబరు 10
- **ఫలితాలు విడుదల:** డిసెంబరు 20
- **ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** డిసెంబరు 30
- **విజేతల లిస్ట్ విడుదల:** 2025 జనవరి 15
- **వెబ్‌సైట్:** aictsd.com

నవ్య | చిత్రజ్యోతి

సందడంతా సెట్స్‌పైనే

ఈ నెలలో ఎన్టీఆర్ 'దేవర' మినహా పెద్ద హీరోల చిత్రాలేవి విడుదల లేకపోవడంతో థియేటర్లలో సందడి తగ్గనుంది. అయితే ఆ సందడి కాస్తా ఇప్పుడు సెట్స్‌లో మొదలైంది. హీరోలంతా కొత్త సినిమాల షూటింగ్స్‌తో బిజీగా ఉన్నారు. యువ కథానాయికలు సెట్స్‌లో చెమటోడ్చుతున్నారు. సీనియర్ హీరోలు షూటింగ్స్‌కు సై అంటున్నారు. వీరిలో కొందరు హీరోయిన్లతో డ్యూయెట్లు పాడుతుండగా మరికొందరు విలన్లతో పోరాడుతున్నారు. మొత్తం మీద వరుస చిత్రీకరణలతో తెలుగు కథానాయకులు జోరు మీదున్నారు.









యాక్షన్ మోడ్‌లో వెంకీ

అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. పది రోజుల క్రితమే పొల్లాచ్చిలో హీరోయిన్ మీనాక్షి చౌదరితో డ్యూయెట్ పాడుకున్నారు వెంకటేశ్. అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకున్నారో లేదో వెంటనే యాక్షన్ సీక్వెన్స్ కోసం రంగంలోకి దిగారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ రెండు రోజుల క్రితమే హైదరాబాద్‌లో మొదలైంది. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఈ 15 రోజుల షెడ్యూల్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ఇతర తారాగణంపై కీలక ఘట్టాలను తెరకెక్కించనున్నారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

కూలీ సెట్స్‌లో నాగ్

మల్టీస్టారర్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు నాగార్జున. రజనీకాంత్ కథానాయకుడిగా రూపొందుతున్న 'కూలీ' షూటింగ్ ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతోంది. నాగార్జున్ సెట్స్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆయనపై యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కొంత టాకీపార్ట్‌ను ఈ షెడ్యూల్‌లో తెరకెక్కించనున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రుతీహాసన్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

క్లైమాక్స్‌కు మట్కా

కరుణకుమార్ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న 'మట్కా' చిత్రం షూటింగ్ క్లైమాక్స్‌కు చేరుకుంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్టూడియోలో పతాక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ఈ పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో మాఫియా నాయకుడి పాత్రలో వరుణ్ తేజ్ సరికొత్త మేకోవర్‌తో అలరించనున్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు.

రాజాసాబ్ పోరాటం

మారుతి దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ సాగుతోంది. ప్రభాస్‌తో పాటు ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటోంది. కొంత టాకీ పార్ట్‌ను పూర్తి చేసిన మారుతి తాజాగా పోరాట ఘట్టాలపై దృష్టి పెట్టారు. రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో సాగే ఈ భారీ యాక్షన్ సీక్వెన్స్‌లో ప్రభాస్ పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్ ముగిశాక హనూ రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం షూటింగ్‌లో పాల్గొనేందుకు ప్రభాస్ చెన్నై వెళ్లనున్నారు.

కేరళకు దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. చిత్రీకరణ చివరి దశలో ఉంది. ఈ వారంలో కేరళలో ఓ భారీ షెడ్యూల్‌ను మొదలుపెట్టేందుకు యూనిట్ సన్నాహాలు చేసింది. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో విజయ్ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. అలాగే 'పుష్ప 2' క్లైమాక్స్ షూట్‌ను ముగించే పనిలో అల్లు అర్జున్ బిజీగా ఉన్నారు.

చందు మొండేటి, నాగచైతన్య కలయికలో రూపొందుతున్న చిత్రం 'తండేల్'. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోందని యూనిట్ తెలిపింది. టాకీపార్ట్‌తో పాటు పాటలను చిత్రీకరిస్తున్నారు. చైతూకు జోడీగా సాయిపల్లవి కనిపించనున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్ నిర్మిస్తున్నారు. నిఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ' షూటింగ్ కొనసాగుతోంది. శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు తెరకెక్కిస్తున్న చిత్రం ప్రస్తుతం సెట్స్‌పై ఉంది. లుధీర్ బైరెడ్డి రూపొందిస్తున్న చిత్రం షూటింగ్‌లో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పాల్గొంటున్నారు. శుక్రవారం నాని 'హిట్ 3' చిత్రీకరణ మొదలుపెట్టారు. సాయిదుర్గ తేజ్ హీరోగా రోహిత్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇటీవలే రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో అటవీ నేపథ్యంలో సాగే యాక్షన్ పార్ట్‌ను యూనిట్ పూర్తి చేసింది.

విరామం తర్వాత

పవన్ కల్యాణ్ పాలిటిక్స్‌తో బిజీగా మారడంతో షూటింగ్స్‌కు తాత్కాలిక విరామం ఇచ్చారు. 'హరి హర వీరమల్లు, ఉస్తాద్ భగత్‌సింగ్, ఓజీ' చిత్రాలను ఆయన పూర్తి చేయాల్సి ఉంది. అలాగే మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం సెట్స్‌పైకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. 'గేమ్ చేంజర్' చిత్రం షూటింగ్‌ను ఇటీవలే పూర్తి చేసిన రామ్‌చరణ్ త్వరలోనే కొత్త సినిమా షూటింగ్‌లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. పీరియాడిక్ చిత్రం కావడంతో ప్రస్తుతం ఆయన సరికొత్త మేకోవర్‌తో సిద్ధమవుతున్నారు. 'దేవర' ప్రచార కార్యక్రమాలను పూర్తి చేసిన ఎన్టీఆర్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కే చిత్రం కోసం రంగంలోకి దిగనున్నారు. అక్టోబర్ నుంచి షూటింగ్ మొదలుపెట్టనున్నట్లు యూనిట్ తెలిపింది. ఎన్టీఆర్ డిసెంబర్‌లో సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు.

హేమ డ్రగ్స్ తీసుకున్నారు


- మెడికల్ రిపోర్టులో రుజువైంది
- రేవ్‌పార్టీ కేసులో కోర్టుకు వెల్లడించిన పోలీసులు



బెంగళూరు నగరంలోని జీఆర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ.. అలియాస్ కృష్ణవేణి డ్రగ్స్ తీసుకున్నట్టు పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. విజయవాడకు చెందిన ఎల్ వాసు ఈ ఏడాది మే 19న జీఆర్ ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహించారు. ఈ పార్టీలో పాల్గొన్న హేమ.. ఎండీఎంఏ సేవించారని, ఆమె మెడికల్ రిపోర్టులు, సంఘటనా స్థలంలో సేకరించిన ఆధారాలు దాన్ని రుజువు చేస్తున్నాయని పోలీసులు చార్జిషీట్‌లో వెల్లడించారు. ఈ రేవ్ పార్టీకి డ్రగ్స్ సమకూర్చిన వారిలో డెంటిస్ట్ రణధీర్ బాబు కీలకంగా వ్యవహరించారని, అబూబకర్ సిద్ధిఖీ పార్టీకి వచ్చిన వారికి కొకైన్, ఎండీఎంఏ సరఫరా చేశారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో సీసీబీ పోలీసులు బెంగళూరు గ్రామీణ పరిధిలోని 8వ జిల్లా అదనపు సెషన్స్ కోర్టులో సోమవారం 1,086 పేజీలతో చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణతోపాటు 82 మంది సాక్షులను విచారించినట్లు అందులో పొందుపరిచారు. అర్ధరాత్రి జరిగిన పార్టీలో ఆంధ్ర, కర్ణాటకకు చెందిన ఫ్యాషన్ డిజైనర్లు, కళాశాల విద్యార్థులు, ప్రైవేట్ కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నట్లు వార్తలు వెలువడ్డాయి. 27 మంది మహిళల సహా 79 మంది డ్రగ్స్ సేవించినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. ఆ వివరాలను పోలీసులు చార్జ్‌షీట్‌లో పొందుపరిచారు. డ్రగ్స్ తీసుకున్న 79 మందితోపాటు రేవ్‌పార్టీ నిర్వాహకులు 9 మంది కలిపి మొత్తం 88 మందిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కాగా, హేమ మాత్రం తాను డ్రగ్స్ తీసుకోలేదని, పోలీసులు తన బ్లడ్ శాంపిల్స్ కూడా సేకరించలేదని మొదటి నుంచీ చెబుతున్నారు. మీడియా కూడా తనను అనవసరంగా ఈ వివాదంలోకి లాగుతోందని ఆరోపించారు. తాను డ్రగ్స్ తీసుకున్నట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనంటూ పలు ఇంటర్వ్యూల్లో ఆమె చెప్పారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

వేట మొదలైంది



హీరో నాని 32వ సినిమా 'హిట్.. ద థర్డ్ కేస్' రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం మొదలైంది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని నటిస్తున్నారు. ఈ ఫెరోషియస్ కేరెక్టర్ కోసం నాని పూర్తిగా మేకోవర్ అయ్యారు. తొలి రోజు షూటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. వచ్చే ఏడాది వేసవిలో మే ఒకటిన ఈ సినిమాను విడుదల చేస్తామని నిర్మాత ప్రశాంతి తిపిర్నేని చెప్పారు. ఈ సినిమాకు ఛాయాగ్రహణం: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జే మేయర్, ఎడిటింగ్: కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్: నాగేంద్ర తంగాల. లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధపు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.వెంకటరత్నం.

బావ.. బావమరిది



తమిళ హీరోలు కార్తీ, అరవింద్ స్వామి నటించిన చిత్రం 'సత్యం.. సుందరం'. ఇంతకుముందు '96' చిత్రాన్ని రూపొందించి ప్రశంసలు అందుకొన్న సి.ప్రేమ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకుడు. సూర్య, కార్తీ నిర్మించిన ఈ సినిమాను ఈ నెల 28న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో కార్తీ అమాయకత్వంతో కూడిన రస్టిక్ క్యారెక్టర్ చేస్తే, అరవింద్ స్వామి రిజర్వ్‌డ్, అర్బన్ పర్సనాలిటీగా కనిపించారు. 'బావా.. బావా' అంటూ అరవింద్‌స్వామి వెంటపడుతూ ఆట పట్టించే టిపికల్ పాత్రను కార్తీ పోషించారు. వీరిద్దరూ పాల్గొన్న సన్నివేశాలతో రూపొందించిన టీజర్ అలరించింది. ఈ పాత్రలను దర్శకుడు అద్భుతంగా ప్రజెంట్ చేశారు. శ్రీదివ్య, స్వాతి కొండే, దేవదర్శిని ముఖ్య పాత్రలు పోషించారు మహేంద్రన్ జయరాజ్ ఛాయాగ్రహణాన్ని, గోవింద్ వసంత సంగీతాన్ని అందించారు.

ఈసారి మహారాణి?

విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించిన 'మహారాజ' చిత్రం ఘన విజయంతో అటు పరిశ్రమ, ఇటు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు దర్శకుడు నితిలన్ స్వామినాథన్. ఆయన దర్శకత్వం వహించబోయే కొత్త చిత్రంలో నయనతార లీడ్‌రోల్ పోషిస్తున్నట్లు, ఆ చిత్రానికి 'మహారాణి' అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మహిళా ప్రాధాన్య కథాంశంతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నయనతార పాత్ర కొత్తతరహాలో ఉండబోతోందని కోలీవుడ్ సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. 'మహారాజా' చిత్రాన్ని నిర్మించిన ప్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుధన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





చంద్రబోస్‌కు పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం

పిల్లలను వారి అభిరుచులకు అనుగుణంగా ఆయా రంగాల్లో ప్రోత్సహించి ఉన్నత స్థాయికి చేర్చిన గొప్ప వ్యక్తి పొన్నం సత్తయ్య అని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ 14వ వర్థంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం సత్తయ్యగౌడ్ పురస్కారాలను ప్రదానం చేశారు. సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డుగ్రహీత చంద్రబోస్, బలగం ఫేమ్ కొమురమ్మ, మొగులయ్యలకు ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలకు 51వేల రూపాయల నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పురస్కారగ్రహీతలను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వెండితెర...

అల్లూరి కథ మరోసారి

తెల్లదొరలకు ముచ్చెమటలు పట్టించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కథను హీరో కృష్ణ అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించిన సంగతి విదితమే. ఈ వీరుని కథ మరోసారి తీయడానికి ఆర్.వి.వి. సత్యనారాయణ పూనుకున్నారు. అల్లూరి జీవిత చరిత్రలో యథార్థ సంఘటనల్ని ప్రజలకు అందించాలనే సంకల్పంతో 'మన్యం ధీరుడు' పేరుతో రూపొందించిన ఈ సినిమాలో అల్లూరి పాత్రను సత్యనారాయణ పోషించారు. నరేశ్ డెక్కల దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. అరకు, పాడేరు, హిమాచల్ ప్రదేశ్, కశ్మీర్‌లో షూటింగ్ చేశారు. భారీ ఖర్చుతో ఒక ఊరినే నిర్మించి అక్కడ కీలక సన్నివేశాలను చిత్రీకరించామనీ, బానిస సంకెళ్లు తెంచుకుని బ్రిటీష్ తెల్లదొరల పాలనకు చరమగీతం పాడే సన్నివేశాలు అద్భుతంగా వచ్చాయనీ నిర్మాత సత్యనారాయణ చెప్పారు. ఈ నెల 20న సినిమాను విడుదల చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



మనసున్న తల్లి కథ



ఓ మధ్యతరగతి తల్లి చుట్టూ తిరిగే కథతో 'తల్లి మనసు' చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో ఆయన తనయుడు కిశోర్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు వి. శ్రీనివాస్ (సిప్పి) దర్శకుడు. 'హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటివరకూ జరిగిన షూటింగ్‌లో రెండు పాటలతో సహా 80 శాతం చిత్రం పూర్తయింది. ఇంకో పాట, మిగిలిన టాకీ పార్ట్ చిత్రీకరించడంతో ఈ నెలాఖరుకు షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. మా నాన్న చిత్రాల స్థాయికి తగ్గట్టుగా చక్కటి కథ, కథనాలతో సినిమా తీస్తున్నాం. ఇటువంటి కథాబలం ఉన్న మంచి చిత్రాన్ని తీస్తున్నందుకు సోషల్ మీడియా ద్వారా మంచి స్పందన లభిస్తోంది. అభినందనలు అందుతున్నాయి' అని నిర్మాత తెలిపారు. ఓ మధ్యతరగతి తల్లి పడే తపన, సంఘర్షణను ఇందులో ఆవిష్కరిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్ర నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు ముత్యాల సుబ్బయ్య తెలిపారు.

వరద బాధితులకు విరాళం



'జెట్టి' సినిమాతో హీరోగా మంచి పేరు తెచ్చుకున్న నటుడు, '100 డ్రీమ్స్' పేరుతో ఎనిమిదేళ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కృష్ణ మానినేని వరద బాధితుల సహాయం కోసం రూ. పది లక్షల విరాళం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఏపీ ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్‌ను కలసి అందజేశారు కృష్ణ. '100 డ్రీమ్స్' ఫౌండేషన్ ద్వారా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను విని, మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని పవన్‌కల్యాణ్ కోరారు

ధైర్యంగా ముందుకు రండి

నటి రోహిణి



కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ అంశంపై ఫిర్యాదు చేసేందుకు వీలుగా నడిగర్ సంఘం ఆధ్వర్యంలో 2019లో ఏర్పాటు చేసిన విశాఖ కమిటీ ముందు బాధితులు బారులు తీరుతున్నట్లు ఆ కమిటీ అధ్యక్షురాలు, సినీ నటి రోహిణి తెలిపారు. ఈ విషయంపై ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. 'సినిమా అవకాశాల పేరుతో లైంగిక వేధింపులు ఎదుర్కొన్న అనేకమంది యువతులు కూడా ఫిర్యాదులు చేస్తున్నారని, వాటిపై సమగ్రంగా విచారణ జరుపుతున్నామని, ఆ విచారణ తర్వాత తదుపరి చర్యలపై ఆలోచన చేసి, ఓ నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇక లైంగిక వేధింపులపై ఫిర్యాదులు చేసిన వారి వివరాలను బహిర్గతం చేయమని, చిత్రపరిశ్రమలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్నవారు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని రోహిణి సూచించారు. ఇదిలా ఉండగా, హీరోయిన్ల గురించి యూట్యూబ్ చానెల్‌లో ఇష్టానుసారంగా, అసభ్యకరంగా మాట్లాడిన డాక్టర్ కాంతరాజ్ అనే వైద్యుడిపై నటి రోహిణి నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

‘ఏచూరి’కి ఘన నివాళి



కాశీబుగ్గ: ఏచూరికి నివాళులర్పిస్తున్న నేతలు

కాశీబుగ్గ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరని లోటని పలువురు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆయన సంస్మరణ సభలు నిర్వహించి నివాళి అర్పించారు. కాశీబుగ్గ సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి గణపతి ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఫాసిస్ట్, మతతత్వ శక్తులు పెచ్చురిల్లుతున్న కాలంలో వామపక్షానికి, దేశానికి దిక్సూకిగా నిలవాల్సిన ఏచూరిని ఈ దేశం కోల్పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు అజయ్‌కుమార్, లావణ్య, సింహాద్రి, డిల్లేశ్వరి, భాగ్యలక్ష్మి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

● **మందస:** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి వామపక్షాల ఉద్యమాలకు తీరని లోటని వక్తలు అన్నారు. మందస బస్టాండు ఆవరణలో శుక్రవారం ఏచూరి చిత్రపటం వద్ద నివాళు లర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.దిలీప్‌కుమార్, వడ్డి గోపాలకృష్ణ, వల్లభ, చిరంజీవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: అరిణాం అక్కివలస, రణస్థలం: పైడిభీమవరం పారిశ్రామికవాడలో నివాళి అర్పిస్తున్న నేతలు

● **కోటబొమ్మాళి:** సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి సంతాపసభను కోటబొమ్మాళి, సంతబొమ్మాళి యూటీఎఫ్ నేతలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్య దర్శి గోండు నారాయ ణరావు, రెండు మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● **టెక్కలి:** సీపీఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి మృతి ప్రజా సంఘాలకు తీరనిలోటని సీపీఎం నాయకుడు నంబూరు షణ్ముఖరావు అన్నారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు ఈశ్వరరావు, ఎల్లయ్య, లక్ష్మణ రావు, మల్లేశ్వరరావు, దుర్గాప్రసాద్, సుబ్రహ్మణ్యం ఉన్నారు.

● **కొత్తూరు:** సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శిర్ల ప్రసాద్, న్యాయవాది అప్పారావు అన్నారు. కొత్తూరులో శుక్రవారం సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో అప్పన్న, తెల్లన్న, దుర్గారావు, అప్పారావు, రమేష్, మిన్నారావు, త్రినాథ రావు తదితరులున్నారు.

● **రణస్థలం:** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం శ్రామిక వర్గానికి తీరనిలోటని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. శుక్రవారం పైడిభీమవరం పారిశ్రామిక వాడలో ఏచూరి సంతాప సభ నిర్వహించి, నివాళలర్పించారు. కార్య క్రమంలో యూనియన్ నాయకులు పి.రామకృష్ణ, బి.సురేష్, టి.వీర్రా రాజు, పున్నాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● **ఎచ్చెర్ల:** ప్రజా పోరాటాల నిర్మాణమే సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సరైన నివాళి అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ (అరిణాం అక్కివలస) వద్ద శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో అగ్రికెమ్ కార్మిక సంఘ నాయకులు ఎల్.రామప్పడు, ఎం.రమణ, ఎ.సత్యనారా యణ, గణపతిరావు, చిన్న, వరదరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఎచ్చెర్లలోని బేవరేజస్ కార్పొరేషన్ బాట్లింగ్ యూనిట్ డిపో వద్ద కార్మికులు సంతాప సభ నిర్వహించారు. ● **ఆమదాలవలస:** సీతారాం ఏచూరి మరణం కార్మిక, కర్షక వర్గాలకు తీరనిలోటని సీపీఎం నాయకులు బొడ్డేపల్లి మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచే పోరాటాలే తన ఊపిరిగా కొనసాగిన వ్యక్తి అని కొనియాడారు. బొడ్డేపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి: సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న నేతలు

● **నందిగాం:** సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. నిరంతరం పోరాటాల్లో పాల్గొని ప్రజాపక్షం వహించారని వారన్నారు. ఏచూరి మృతి దేశానికి తీరని లోటని అన్నారు. సంతాపం తెలిపిన వారిలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలక శంకర రావు, సీపీఎం మండల కార్యదర్శి పి.సాంబమూర్తి, గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తమిరె వైకుంఠరావు తదితరులు ఉన్నారు.



ఆమదాలవలస, మందస, కోటబొమ్మాళి, కొత్తూరులో సీతారాం ఏచూరి చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజాసంఘాలు, సీపీఎం నేతలు, కార్యకర్తలు

కోటబొమ్మాళి ఎస్ఐగా సత్యనారాయణ



కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ఎస్ఐగా వి.సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పోలాకి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన షేక్‌మహ్మద్ ఆలీ నందిగాం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణను సిబ్బంది స్వాగతం పలికి అభినందించారు. అంతకు ముందు ఆయన కొత్తమ్మతల్లి తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

నౌపడ ఎస్ఐగా నారాయణస్వామి



సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ ఎస్ఐగా జి.నారాయణస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన అన్నారు. సంతబొమ్మాళి ఎస్ఐ గా పనిచేస్తున్న సిద్ధార్థ్ కుమార్‌ను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నందిగాం ఎస్ఐగా షేక్‌మహ్మద్ ఆలీ



నందిగాం: నందిగాం ఎస్ఐగా షేక్‌మహ్మద్ ఆలీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కోటబొ మ్మాళి నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఎస్ఐగా పనిచేసిన మహ్మద్ అమీర్ ఆలీని వీఆర్‌కు పం పారు. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడతానని షేక్‌మహ్మద్ ఆలీ అన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మెళియాపుట్టి: పౌష్టికాహారంతో ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో విమలారాణి అన్నారు. శుక్రవారం హీరాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

గ్రామాల పూర్వ వైభవానికి కృషి: మంత్రి అచ్చెన్న

కోటబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సాగు, తాగునీటి సదుపాయం, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లోని సమస్యలపై ప్రణాళికలు తయారు చేసి తన దృష్టికి తీసుకురావాలన్నారు. ● ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన నిమ్మాడ జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణరావు (భౌతికశాస్త్రం), ఎస్.దేవి (జీవ శాస్త్రం) లను మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. ● **కొత్తూరు:** రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి శుక్రవారం నిమ్మాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందించారు.

గ్రానైట్ పర్మిట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకోండి



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న గ్రానైట్ క్వారీల ప్రతినిధులు

టెక్కలి: జిల్లాలో గ్రానైట్ గ్రానైట్ బ్లాకులు తరలించేందుకు అనుమతులు జారీకి చర్యలు తీసుకోవాలని గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్, గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్ ప్రతినిధులు, గ్రానైట్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం పర్మిట్లు జారీచేయాలని మెమో జారీచేసినా స్థానికంగా విశ్వసముద్ర సంస్థ అనుమతుల్వీడం లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. మైన్స్‌డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో పర్మిట్లు జారీచేసేందుకు చర్యలు తీసు కుంటామని డైరెక్టర్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో గ్రానైట్‌క్వారీ యజమానులు మహేష్, అజయ్ కొల్లా, గండి సూర్య నారాయణరెడ్డి, వెంకటాచలపతి, మధుకాన్ శ్రీను, ట్రాన్స్‌పోర్ట్ యజమానులు కింజరాపు సురేష్, అల్లు నగేష్, తవిటిరాజు, యర్రబ్బాయి, కింగ్, పాలిషింగ్ యూనిట్ల ప్రతినిధులు నవీన్‌చౌదరి, గోపి, జయరాం, మలయంటి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

హరిపురం/మెళియాపుట్టి: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ ఎల్.మధు అన్నారు. మందస మండలం జిల్లుండ, మెళియాపుట్టి మండలం పరశు రాంపురం గ్రామంలో శుక్రవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చిరొట్ట, విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యం, సమగ్ర కలుపు యాజమాన్యం, సమగ్ర నీటి యాజమాన్యం, కాలిబాటలు వేయటం తదితర అంశాలను వివరించారు. అనంతరం పొలంబడి నిర్వహించి ఎరువుల వినియోగంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఆత్మ ఏడీఏ సీహెచ్ సీహెచ్ వెంకటరావు, కేవీకే శాస్త్రవేత్త కిరణ్, ఏవో దానకర్ణుడు, ఏఈవోలు పాల్గొన్నారు.

పొలంబడిని సద్వినియోగం చేసుకోండి

వజ్రపుకొత్తూరు: పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి కిరణ్‌వాణి అన్నారు. శుక్రవారం పాతటెక్కలిలో పొలంబడి నిర్వహించి ఆధునిక వ్యవసాయంపై అవగాహన కలిగించారు. జిల్లేడు ద్రావణం తయారుచేసి పొటాష్‌కు ప్రత్యామ్నాయంగా వినియోగించవచ్చన్నారు. ఏఈవో జ్యోత్స్న, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి

పలాస: ఎన్నికలకు ముందు టీడీపీ పెట్టుబడుల సాయం కింద అందజేస్తామన్న రూ.25 వేలు తక్షణం ఇవ్వాలని ఏపీ జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మాకనపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందించారు. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజనులో కరవు, తుఫాన్‌లతో నష్టపోయిన పంటలకు బీమా పరిహారం చెల్లించాలన్నారు. ఉచిత పంటలబీమా అందించాలని, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో గార రుద్రయ్య, రాపాక చిన్నారావు, రత్నాల తేజేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగా వైసీపీ నేతలపై దాడులు

పలాస: నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై ఉద్దేశపూర్వకంగా దాడులు చేస్తున్నారని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి న్యాయం చేయాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం కాశీబుగ్గలో ఎస్పీ మహేశ్వర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జరిగిన ఘటనలపై ఆధారాలతో సహా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా కేసులు నమోదు చేయడం లేదన్నారు. దాడులు చేసిన వారిని విడిచిపెట్టి బాధితులకు ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

గ్రామాల అభివృద్ధి శ్రీకారం చుట్టాలి

నరసన్నపేట: మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలు అభివృద్ధికి బాటలు వేయాలని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ పరిశీలకుడు కె.నాగరాజు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రతి ఇంటికి తాగునీరు, గ్రామా ల్లో రోడ్ల సదుపాయం, ఇంటింట వైద్యసేవలు, విద్యాభివృద్ధితో పాటు ఉపాధి మార్గాలను చూపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు, ఈవోపీఆర్డీ రామకృష్ణ, ఏవో సునీత, ఎంఈవో శాంతారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయభాస్కర్, ఏపీవో యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై పర్యవేక్షణ పెంచాలి

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలలపై ఎంఈవోలు మరింత పర్యవేక్షణ పెంచాలని డీఈవో ఎస్. తిరుమలచైతన్య సూచించారు. శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. సెలవు దినాల్లో ప్రైవేటు పాఠశాలలు తెరిస్తే తగు చర్యలు తీసుకోవాలన్నారు. రికార్డులను పరిశీలించారు. ఎంఈవోలు పి.దాలినాయుడు, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల నిర్మాణానికి త్వరలో చర్యలు: డీఈవో



హిరమండలం: మండలానికి మంజూరైన రెండు పీఎం జన్‌మన్ హాస్టళ్ల నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయిందని, త్వరలో టెండర్లు పిలిచి పనులుచేపడతామని డీఈవో తిరుమల చైతన్య అన్నారు. గొడియాపాడు వద్ద సేకరించిన స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. అనం తరం విలేకరులతో మాట్లాడుతూ.. 50 మంది గిరిజన విద్యార్థులకు గులుమూరు వద్ద, అలా గే రెండో హాస్టల్ గొడియాపాడు సమీపంలో నిర్మించనున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కె.రాంబాబు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

కుమారుడిని విడిచిపెట్టేలా చర్యలు తీసుకోండి

● ఎస్పీ మహేశ్వర్ రెడ్డిని కోరిన మాజీ మావోయిస్టు తల్లి

● ఎమ్మెల్యే శిరీషతో కలిసి వినతిపత్రం ఇచ్చిన కాములమ్మ



ఎస్పీ మహేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష, కేశవరావు తల్లి కాములమ్మ

పలాస, సెప్టెంబరు 13: మావోయిస్టుగా పనిచేస్తున్న తన కుమారుడు దున్న కేశవరావు కాంగ్రెస్ ప్రభుత్వంలో 2011 సంవత్సరంలో జనజీవనస్రవంతిలో కలిశాడని, అయితే ఆ తరువాత ఒడిశా పోలీసులు విచారణ పేరుతో తీసుకువెళ్లి ఇప్పటి వరకు విడిచిపెట్టలేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని మాజీ మావోయిస్టు తల్లి కాములమ్మ వేడుకున్నారు. ఈ మేరకు శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డిని ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తన ఆవేదనను ఎస్పీ ఎదుట వ్యక్తం చేసి తన కుమారుడి విడు దలకు చర్యలు తీసుకోవాలని వేడుకుంది. ఆమె తెలిపిన వివరాలిలా.. మందస మండలం నల్లబొడ్లూరు గ్రామానికి చెందిన మావోయిస్టుగా వ్యవహరించిన దున్న కేశవరావు 2011లో అప్పటి ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు ఆధ్వర్యంలో హైదరాబాద్ వెళ్లి డీజీపీని కలిసి మావోయిస్టు జీవితాన్ని విడిచిపెడుతున్నట్లు ప్రకటించారు. అప్పటికే అతనిపై రూ.లక్షల రివార్డు ఉంది. అన్నీ విడిచిపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకంతో తుపాకీని వీడి లొంగిపోయారు. అప్పట్లో ఆయనను అందరూ అభినందించారు. అయితే ఆ ఆనందం ఎంతో సేపు నిలువలేదు. బయటకు రాగానే మాటువేసి ఉన్న ఒడిశా పోలీసులు విచారణ చేపట్టి వెంటనే విడుదల చేస్తామని చెప్పి ఒడిశా పట్టుకెళ్లి భువ నేశ్వర్ కేంద్ర కారాగారంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఆయనను బంధించారు. ఒడిశా రాష్ట్రంలో కేశవరావుపై అనేక కేసులుండడంతో అక్కడి రాష్ట్ర చట్టం మేరకు జైలులో ఉండే కేసు విచారణకు హాజరుకావాల్సి ఉంది. ఆ నేపథ్యంలో 13 ఏళ్ల పాటు నేటి వరకు జైలులోనే ఉన్నారు. భువనేశ్వర్‌లో దున్న కేశవరావును కలుసుకునేందుకు తల్లి కాములమ్మ చేసిన ప్రయత్నం, అతడు పడుతున్న ఇబ్బందులను వివరించారు.

న్యాయం చేయండి: శిరీష

జనజీవనస్రవంతిలో కలిసిన దున్న కేశవరావును మానవతా దృక్పథంతో విడుదల చేయాలని, కాము లమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే శిరీష ఎస్పీని కోరారు. మన రాష్ట్రంలో జనజీవన స్రవంతి లో కలిసిన వారికి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని, కనీసం ఆ రాయితీలను కూడా అందుకోకుండా ఆయనను ఇబ్బంది పెట్టిన వారమయ్యామని ఎస్పీకి వివరించారు. జైలులో 14 ఏళ్లు ఉంటే అటువంటి వారిని విడుదల చేసే అవకాశం ఉందని, దానికి కూడా కేశవరావు అర్హులేనని, మానవతా దృక్పథంతో ఆయన వివరాలు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ.. ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళతానని స్పష్టం చేశారు.

గణనాథుని సేవలో..

వజ్రపుకొత్తూరు: పూండి, బెండి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, పుచ్చ శోభారాణి, కర్ని డిల్లేశ్వరి, కణితి సురేష్ తదితరులు పాల్గొన్నారు.● **నరసన్నపేట:** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగన్నాథపురం, శివనగర్ కాలనీల్లోని మండపాల వద్ద అన్న సంతర్పణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని అన్నప్రసాదాన్ని భక్తులకు అందిం చారు. శివానగర్ కాలనీ పూజలను చేపట్టారు. ఈకార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కింజరాపు రామారావు, మాజీ ఎంపీటీసీ పీస కృష్ణ, కోట అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే నందిగాం, జలుమూరు మండలాల్లో వినాయక మండపాల వద్ద సామూహిక కుంకుమ పూజలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



జలుమూరు: గుండువలస, నందిగాంలో వినాయక మండపాల వద్ద సామూహిక కుంకుమ పూజలు

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

మబగాం(పోలాకి): క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని, క్రీడాస్ఫూర్తితో విద్యార్థులు వ్యవహరించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మబగాంలో గత రెండురోజులుగా నిర్వహిస్తున్న గ్రిగ్స్ బాలుర, బాలికల క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను అందంచారు. కార్యక్రమంలో మాజీ విప్ తెలుగు పావని, యువజన నాయకుడు కాయ రవి, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు

చికిత్స పొందుతూ నవజాత శిశువు మృతి

నరసన్నపేట: ఇటీవల మతిస్థిమితం లేని తల్లికి జన్మించిన నవజాత శిశువు ఐదురోజులుగా చికిత్స పొందుతూ శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈనెల 8న రాత్రి 11 గంటల సమయంలో కోమర్తి కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద పురిటినొప్పులతో బాధపడుతున్న మతిస్థిమితం లేని ఒక మహిళ మగబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. నవజాత శిశువుతో పాటు తల్లికి కూడా 108లో పోలీసుల సమక్షంలో స్థానిక సామాజిక ఆసుపత్రికి తరలించారు. అదే రోజు శిశువు ఆరోగ్యం విషమంగా ఉండడంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. ఐదురోజులుగా చికిత్స పొందిన నవజాత శిశువు మృతిచెందింది. ఈ విషయాన్ని బాల, శిశు సంరక్షణ అధికారులతో పాటు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆసుపత్రికి చేరుకొని నవజాత శిశువు మృతదేహాన్ని కార్పొరేషన్ సిబ్బందితో ఖననం చేయించారు. అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శిశువు తల్లిని శ్రీకాకుళం మదర్‌థెరిసా ఆశ్రమానికి తరలించినట్లు బాల,శిశు సంరక్షణ జిల్లా కౌన్సిలర్ డి.సీతారాం తెలిపారు.

మినీ జాబ్‌మేళాలో 36 మంది ఎంపిక

పాతపట్నం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనశాఖల సంయుక్త ఆధ్వర్యంలో మినీ జాబ్‌మేళా శుక్రవారం నిర్వహించారు 92 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 36 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.శ్రీరాములు, ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి ఎ.వంశీ, జిల్లా నాన్ టెక్నీ కల్ అధికారి సాయిరాం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నరసన్నపేట: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం పి.వెంకట్రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్-14, 17, 19 విభాగాల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ● **గంగివలస (పోలాకి):** రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు గంగివలస కేజీబీవీ నుంచి ఏడుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు పీఈటీ జి.ప్రియాంక తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. అండర్ 14, 17, 19 విభాగాల్లో ఎంపికైనవిద్యార్థినులను ప్రత్యేకాధికారి శారద తదితరులు అభినందించారు. శుక్రవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు.

నేడు కోర్టులో జాతీయ లోక్‌అదాలత్

టెక్కలి: కోర్టు ప్రాంగణంలో శనివారం ఉదయం 10గంటల నుంచి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించ నున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నామని ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

పాతపట్నం: ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. సీతారాంపల్లికి చెందిన పడ్డ లోకేశ్వరరావు, కరుణ దంపతులు స్థానిక నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ సమీపంలో నిర్మించిన వసతి షెల్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. దూర ప్రాంతాల నుంచి వచ్చేభక్తులు ఈ షెల్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ పాల్గొన్నారు.

లింగాలవలస వద్ద రైల్వేగేటును కొనసాగించాలి

టెక్కలి: లింగాలవలస పరిధిలో రైల్వే గేటు మూసివేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. రైల్వేగేటు మూసివేయడం వల్ల అండర్‌పాసేజ్ నుంచి కనీసం అంబులెన్స్, గ్రానైట్ లారీలు, బోర్‌వెల్ మిషన్లు వెళ్లలేని పరిస్థితి ఉందని, అందువల్ల రైల్వేగేటు కొనసాగించాలని సొర్లి గాం, సవరసొర్లిగాం, హరిపురం, సన్యాసిపేట, మర్రిపాడు, బంజీరుపేట తదితర గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. రైల్వే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నంపై దర్యాప్తు

టెక్కలి: కె.కొత్తూరు పీహెచ్‌సీ ఆశావర్కర్ సరస్వతి తనను ఏఎన్‌ఎం హేమలత వేధిస్తున్నారని నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘనటపై శుక్రవారం జిల్లా వైద్యాధికారులు దర్యాప్తు చేపట్టారు. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డి.శ్రీకాంత్, డీపీఎంవో వాన సురేష్, వైద్యాధికారులు ఏఎన్‌ఎం, ఆశావర్కర్ నుంచి రాతపూర్వకంగా వివరాలు సేకరించారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని వారు తెలిపారు.

కళలకు పూర్వవైభవం తీసుకురావాలి

హరిపురం: కళలకు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రముఖ వైద్యుడు తిరుపతిరావు సాహు అన్నారు. కిల్లోయి గిరిజన గ్రామంలో వినాయక చవితి సందర్భంగా శుక్రవారం ‘భారతో లీల’ ఒడియా సవర భాషా నాటకాన్ని ప్రదర్శించారు. కళాకారులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఎన్.గోవిందరాజులు, నల్ల నాగేశ్వరరావు, చిత్రసేను పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

పలాస: ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా భూగర్భ జలవనరులశాఖ డీడీ రమణమూర్తి కోరారు. ఈ మేరకు శుక్రవారం మామిడిమెట్టు గ్రామంలో గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు బిల్లులివ్వడంలో జాప్యం జరుగుతోందని, దీనిపై అధికారులు స్పందించి ఇబ్బందులను తొలగించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలపై ఇచ్చిన లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. కార్య క్రమంలో ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు, ఈవోపీఆర్డీ మెట్ట వైకుంఠరావు, ఏఈ వైకుంఠరావు పాల్గొన్నారు.

నేటినుంచి అంతర్ జిల్లాల టెన్నీకాయిట్ పోటీలు

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు హైస్కూల్ ఆవరణలో అంతర్‌జిల్లాల హైస్కూల్ విద్యార్థులకు టెన్నీ కాయిట్ పోటీలు శనివారం నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పీఈవో గజేంద్రరావు తెలిపారు. ఈ పోటీలను ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు జారీ

మెళియాపుట్టి: మెళియాపుట్టి పాలకర్రచెరువు గట్టును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న ఆక్రమణ దారులకు శుక్రవారం నోటీసులు జారీ చేసినట్లు వీఆర్వో కోటేశ్వరరావు తెలిపారు. నోటీస్‌లు స్పందించి పనులు నిలుపుదల చేయకుంటే రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో తొలగిస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా మరోవైపు ఆక్రమణదారులు అక్రమ నిర్మాణాలపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు స్థానిక టీడీపీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే మామిడి గోవిందరావుపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు మంతనాలు చేస్తున్నట్లు సమాచారం.

కేరాసింగి గ్రామాన్ని సందర్శించిన ఆర్డీవో

మెళియాపుట్టి: కేరాశింగి గ్రామాన్ని టెక్కలి ఆర్డీవో సుదర్శన్ దొర శుక్రవారం సందర్శించారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు శనివారం గ్రామంలో పర్యటించనున్నందున ముందస్తుగా ఆర్డీవో పర్యటిం చి స్థానికుల నుంచి సమస్య లను అడిగి తెలుసుకున్నారు. కొండపైన గ్రామాలకు రహదారి సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గిరిజనులు తమ సమస్యలను వినతుల రూపంలో అందిం చాలని ఆయన కోరారు. ఆయనతో పాటు తహసీల్దార్ వి.హనుమంతరావు తదితరులున్నారు.

కిడ్నీ వ్యాధితో యువకుడి మృతి


గురుమూర్తి(ఫైల్)

ఇచ్ఛాపురం: ఈదుపురం గ్రామానికి చెందిన దల్లి గురుమూర్తి(39) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందాడు. గురుమూర్తికి రెండు కిడ్నీలు పాడవడంతో కొన్నేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటున్నాడు. శుక్రవారం వైజాగ్‌లో చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందాడు. గురుమూర్తికి భార్య మాణిక్యం, ఇద్దరు కుమార్తెలు గీత, శ్రావణి, కుమారుడు తేజ ఉన్నారు. గురుమూర్తి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఏ తప్పూ చేయకున్నా పోలీసుల దాడి చేశారు

- యువకుడి ఆవేదన
- జిల్లా ఆసుపత్రిలో చికిత్సతో విషయం బయటకు..


పోలీసులు కొట్టారంటూ దెబ్బలు చూపిస్తున్న గురుప్రసాద్

టెక్కలి: తాను ఏ తప్పూ చేయకుండానే పోలీసులు స్టేషన్‌కు పిలిపించి తనపై దాడి చేసి గాయపరిచారని టెక్కలి శ్రీనివాస్‌నగర్‌కు చెందిన ఇల్లా గురుప్రసాద్ తండ్రితో కలిసి ఆరోపించాడు. తనపై పోలీసులు దాడిచేశారని, తనకు నొప్పిగా ఉందని జిల్లా కేంద్ర ఆసుపత్రికి వెళ్లగా వైద్యులు ఎంఎల్‌సీ నమోదు చేసి పోలీసులకు సమాచారం అందించినా.. వారు స్పందించలేదని వాపోయాడు. ఆ వివరాలిలా ఉన్నాయి.. వివాహితను వేధిస్తున్నానంటూ ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇచ్చారనే కారణంతో పోలీసులు పలుమార్లు తనను స్టేషన్‌కు పిలిచారని, వినాయక చవితి రోజున కూడా గట్టిగా కొట్టి గాయపరిచారన్నారు. తాను ఎక్స్‌రే తీసుకుని చికిత్స పొందానన్నాడు. శుక్రవారం కూడా పోలీసులు ఇంటికి వచ్చి తనను స్టేషన్ రావాలని చెప్పడంతో వెళ్లగా.. బూటు కాలితో తన్ని కొట్టారని, దీంతో తట్టుకోలేక ఆసుపత్రికి తన తండ్రి చక్రపాణితో కలిసి చికిత్స కోసం వెళ్లానని చెప్పాడు. తాను ఒక అమ్మాయిని ప్రేమించానని, ఆమెకి ఇటీవల పెళ్లి కూడా జరిగిందని, తాను ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారని, తాను చదువుకున్న యువకుడినని, తనపై అమ్మాయి తల్లిదండ్రులు, పోలీసులు కూడా వరుసగా దాడి చేస్తున్నారని వాపోయాడు. తనకు పోలీసులు కొట్టిన దెబ్బలను మీడియాకు చూపించాడు. ఈ విషయమై సీఐ ఎ.విజయ్ కుమార్ వద్ద ప్రస్తావించగా.. ఆ యువకుడు ఓ వివాహితను వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు అందిందని, దీనిపై దర్యాప్తునకు స్టేషన్‌కు పిలిపించడం జరిగిందన్నారు. ఆ యువకుడి మెంటల్లీ డిజార్డ్ అని వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎచ్చెర్ల: ఎస్‌ఎం పురం సమీపంలోని తోటల్లో శుక్రవారం పేకాటాడుతున్న ముగ్గురు వ్యక్తులను ఎచ్చెర్ల పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.9,700 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

పారదర్శకంగా గ్రామ, వార్డు మహిళా పోలీసుల బదిలీలు

శ్రీకాకుళం క్రైం: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు శుక్రవారం జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బదిలీలు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 238 మంది మహిళా పోలీసులు ఆన్‌లైన్‌లో బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 71 మందిని బదిలీ చేయగా 149 మంది యథావిధి స్థానాల్లో కొనసాగడానికి అంగీకారం తెలపగా, 18 మంది గైర్హాజరయ్యారు. ముందుగా మ్యూచువల్ బదిలీలు, స్పౌస్ కోటా, ఆరోగ్యపరమైన సమస్యల ప్రతిపాదికన బదిలీలు చేపట్టారు. ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి పి.వాసుదేవరావు పారదర్శకంగా కౌన్సెలింగ్ చేపట్టారు. కార్యక్రమంలో పోలీసు కార్యాలయ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పొందూరు: తాడివలస గ్రామంలో ఏర్పాటుచేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌శాఖ సిబ్బంది శుక్రవారం పోలీసుల బందోబస్తు మధ్య ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో లోఓల్టేజీ సమస్య రావడంతో సర్పంచ్ టి.మనెమ్మ విజ్ఞప్తి చేయడంతో ఎమ్మెల్యే కూన రవికుమార్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు. పంచాయతీ తీర్మానంతో గ్రామంలో చెరువుగట్టుపై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఏఈ దుర్గాప్రసాద్ పనులు ప్రారంభించగా.. వైసీపీ నాయకులు కొందరు పనులను అడ్డుకున్నారు. దీంతో సర్పంచ్ సూచనతో పోలీసులకు ఫిర్యాదు చేశామని వారి సహకారంతో పనులు చేసినట్టు ఏఈ తెలిపారు.

ఆకతాయి చేష్టలకు పాల్పడితే చర్యలు


ట్రాఫిక్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైం: నగరంలో కళాశాలలు, పాఠశాలల ప్రాంతాల్లో కొంత మంది యువత ఆకతాయి చేష్టలకు పాల్పడుతున్నట్టు గుర్తించామని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద అన్నారు. ఈ మేరకు స్థానిక ఉమెన్స్ కళాశాల ప్రాంతంలో శుక్రవారం సీఐ కె.పైడపునాయుడుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో డీఎస్పీ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొంత మంది ఆకతాయిలు అల్లరి చేస్తున్నట్టు వారు చెప్పడంతో ఆ ప్రాంతంలో పోలీసు నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మహిళా కళాశాల రోడ్డులో ట్రాఫిక్ సమస్య నెలకొందని తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్టు స్థానికులు చెప్పారు.

వ్యాసరచన పోటీల్లో బీఆర్‌ఏయూ విద్యార్థిని ప్రతిభ

ఎచ్చెర్ల: విశాఖలోని రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ విద్యార్థిని జామి శిరీష ప్రతిభ కనబరిచారు. వర్సిటీలో బీఈడీ (స్పెషల్) చదువుతున్న శిరీష స్వామి వివేకానంద- విశిష్టమైన భారతీయ సంస్కృతి అనే అంశంపై రాసిన వ్యాసానికి రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. విద్యార్థిని చూపిన ప్రతిభపై వర్సిటీ వీసీ కేఆర్ రజని శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ విద్యా విభాగం సమన్వయకర్త హనుమంతు సుబ్రమణ్యం, డాక్టర్ జేఎల్ సంధ్యారాణి పాల్గొన్నారు.

నందికొండను హడలెత్తిస్తున్న జ్వరాలు

- మంచానపడిన 25 మంది.. ఓ విద్యార్థికి డెంగ్యూ నిర్ధారణ


సరుబుజ్జిలి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆనుకొని ఉన్న నంది కొండ గ్రామంలో జ్వరాలు హడలెత్తిస్తున్నాయి. శుక్రవారం గ్రామంలోని ఒక వీధికి చెందిన జ్వర పీడితుల వివరాలు స్థానిక వైద్యాధికారి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. ఇదే గ్రామానికి చెందిన పట్నాన వేణుశ్రీ ఎల్ఎన్ పేట వసతిగృహంలో 8వ తరగతి చదువుతుంది. ఇటీవల స్వగ్రామానికి వచ్చి జ్వరం బారిన పడగా.. స్థానిక పీహెచ్‌సీలో వైద్యసేవలకు వెళ్లగా.. మెరుగైన చికిత్స కోసం జొన్నవలస 30 పడకల ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ రక్త పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ లక్షణాలు ఉన్నట్టు గుర్తించి శ్రీకాకుళం రిమ్స్‌కు పంపించారు. అక్కడి వైద్యులు ఆ బాలికకు డెంగ్యూ ఉన్నట్టు నిర్ధారణ చేసి తిరిగి జొన్నవలస ఆసుపత్రిలోనే వైద్య సేవలు అందించాలని పంపించారు. అలాగే నందికొండ గ్రామానికి చెందిన పెరుమాళ్ల అప్పారావు, చెల్లమ్మ దంపతులు కూడా జ్వరం బారిన పడి శుక్రవారం పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామానికి చెందిన సుమారు 25 మంది జ్వరాలు బారిన పడినట్టు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్య బృంద సభ్యులు తెలుపుతూ వారికి అవసరమైన వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. నందికొండ గ్రామంలో పర్యటించిన వైద్య బృందంతో స్థానిక ఎంపీడీవో పీవీవీ మురళీమోహన్ కుమార్, ఈవోపీఆర్డీ ఆనందరావు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం

- వర్షం కురిస్తే ప్రయాణం నరకమే..
- గుంతల్లో నీరు చేరి ప్రమాదకరంగా..
- రాకపోకలకు ఇబ్బంది
- ఈదుపురంలో పూడుకుపోయిన కాలువలు
- పట్టించుకోని యంత్రాంగం


ఇటీవల కురిసిన వర్షానికి బాహుదానది వంతెన వద్ద..


రైల్వే ఉత్తర క్యాబిన్ రోడ్డు..


బెహరా వీధిలో రోడ్డుపైనే మురుగు నీరు

ఇచ్ఛాపురం: ఇటీవల కురిసిన వర్షాలకు పలు చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో రాకపోకలకు వాహచోదకులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికే పాడైపోయిన రోడ్లపై చిన్నచిన్న గుంతలు ఏర్పడగా.. అవి క్రమంగా పెద్దవి అయ్యాయి. చిన్నపాటి వర్షం కురిసినా గోతుల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగానే ఈ రోడ్లన్నీ ఛిద్రంగా మారాయి. బస్టాండ్ జంక్షన్, పీకరుపేట, బాహుదానది వంతెనపై, వీకే పేట ఇలా పలు చోట్ల రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. ఆర్టీసీ కాంప్లెక్‌లో చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిల్వ ఉండిపోయి ప్రయాణికులు వెళ్లేందుకు ఇబ్బందిపడుతున్నారు. కాగా ఈదుపురం గ్రామంలో కాలువలు పూడుకుపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షంతో కాలువ నీరు రోడ్డుపైనే ప్రవహించింది. బెహరా వీధిలో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అంబటి కృష్ణపై చర్యలు తీసుకోండి


ఫిర్యాదు చేస్తున్న డీసీసీ మాజీ అధ్యక్షుడు పరమేశ్వరరావు

శ్రీకాకుళం క్రైం: తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అంబటి కృష్ణపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఐ కె.పైడపునాయుడును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9న అంబటి కృష్ణకు బాధ్యతలు అప్పగించానని, బ్యాంకు ఖాతాల్ని అప్పగించాలని కృష్ణ కోరగా, ట్రస్టు సభ్యులందరూ ఉన్నప్పుడు అప్పగిస్తానని చెప్పి వెళ్లిపోయానన్నారు. అయితే తాను వెళ్లిపోయిన కొద్ది సేపటికే కార్యాలయంలో కింద రూమ్‌లోని ఏసీ షార్టు సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగినట్టు సిబ్బంది ద్వారా తెలుసుకుని తిరిగి కార్యాలయానికి వెళ్లానన్నారు. జరిగిన ప్రమాద ఘటనపై పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించానన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన రోజు ఈ ఘటన జరగడం శుభసూచకం కాదని ఎవరికీ చెప్పవద్దని కృష్ణ చెప్పడంతో అందరం ఆగిపోయామన్నారు. బ్యాంకు ఖాతాలు అప్పగించలేదన్న అక్కసుతో, తనపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే రూరల్ పోలీసు స్టేషన్‌లో అగ్ని ప్రమాదానికి నేనే కారణమంటూ తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తూ, మానసిక వేదనకు గురి చేసిన అంబటి కృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు.

కేంద్ర మంత్రికి పదవిపై హర్షం


జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అరసవల్లి: ఆసియా పసిఫిక్ దేశాల ఛైర్మన్‌గా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎన్నిక కావడంపై ముస్లిం సామాజిక వర్గ నేతలు, మత పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం నుంచి ఎంపీగా వరుసగా మూడుసార్లు ఎన్నికై, కేంద్ర మంత్రిగా సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు 40 దేశాలతో కూడిన ఆసియా పసిఫిక్ దేశాల ఛైర్మన్ పదవి లభించడం, జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ మేరకు నగరంలోని జీటీ రోడ్డులో గల జామియా మసీదు (పెద్ద మసీదు)లో ఆయన పేరిట ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో షేక్ నిజాముద్దీన్, బహదూర్ బాషా, ఎండీ రఫీ, మహమ్మద్ రఫీ, హుస్సేన్, అదిల్, రహ్మాన్, నాని, కరీం, షఫీ, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలకు పయనం

ఆమదాలవలస: అనంతపురం జిల్లాలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న జన విజ్ఞానవేదిక రాష్ట్ర మహాసభలకు జిల్లా నాయకులు తరలివెళ్లారు. శుక్రవారం శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో అనంతపురానికి బయలుదేరి వెళ్లారు. వారు మాట్లాడుతూ.. అనంతపురంలో రెండు రోజులపాటు జరిగే జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలకు తరలివెళ్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైలులో కామ్రేడ్ ఏచూరి సీతారాం మృతికి నివాళులు అర్పిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. మహాసభలకు బొడ్డేపల్లి మోహన్‌రావు, కె.కామేశ్వరరావు, పి.కూర్మారావు, బి.జనార్దనరావు, పి.ధర్మారావు, ఎస్.సంజీవరావు, ఆర్.సురేష్‌బాబు, బి.కాశీవిశ్వనాథ్, బి.ధనలక్ష్మి, పేడాడ వేదవతి, గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటులో అధికారుల ఇష్టారాజ్యం సరికాదు

ఆమదాలవలస: పని సర్దుబాటు పేరిట ప్రాథమిక పాఠశాలలకు మంగళం పాడేటట్టు అధికారుల చర్యలు ఉన్నాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి అన్నారు. శుక్రవారం తొగరాం పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎక్కువ మంది విద్యార్థులుంటే ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించడం చేయాలని, లేనిపక్షంలో ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగించాలన్నారు. అందుకు విరుద్ధంగా విద్యార్థుల సంఖ్య తగ్గారన్న కారణంతో గతంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లోని బోధన సహాయకులను తొలగించారని, ఇప్పుడు సర్దుబాటు పేరిట ఉన్న భాషా పండిట్లను కూడా వేరే పాఠశాలకు కేటాయిస్తే అక్కడ ఉన్న ప్రాథమికోన్నత తరగతుల విద్యార్థుల పరిస్థితి ఏమిటన్నారు. ఇప్పటికైనా అధికారులు తీసుకున్న నిర్ణయాలు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా ఉండేలా చూడాలని పాల పెద్దలు పెండింగ్ డీఏ ఎరియర్లు, డీఏలు, ఐఆర్‌లపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్టీయూ మండల నాయకులు రమేష్, రమణమూర్తి, రామచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో బాధ్యత వహించాలి

అరసవల్లి: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు బాధ్యత వహించాలని జిల్లా యువజన అధికారి వెంకట్ ఉజ్వల్ అన్నారు. ఝాన్సీ అగ్రికల్చరల్ అండ్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ సొసైటీ(ఎన్‌వైకే) అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో బలగ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ విద్యార్థి మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీ మురళీకృష్ణ, డి.శ్రీనివాసరావు, రౌతు సుమతి, ఎ.పున్నయ్య రాజేశ్వరి, సత్యన్నారాయణ, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

లావేరు: కంటి ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని బుడుమూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉరిటి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో స్థానిక పాఠశాల విద్యార్థులకు శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రి ఉప్తాలమిక్ ఆఫీసర్ ఉప్పు మహేశ్వరరావు కంటి పరీక్షలు చేశారు. ఈ తనిఖీల్లో తొమ్మిది మంది కంటి సమస్యలు ఉన్నట్టు గుర్తించారు. ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు, ఎస్‌కే ప్రసాదరావు, ఆనందరావు, తమ్మినాయుడు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

టూటౌన్ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

శ్రీకాకుళం క్రైం: నగరంలోని రెండో పట్టణ పోలీసు స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు స్టేషన్‌కు ఆనుకుని ఉన్న పోలీసు షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆయన పరిశీలించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న సుమారు 10 దుకాణాలను ఆయన పరిశీలించి, అద్దె చెల్లింపులపై సీఐ జి.ఉమామహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అలాగే వ్యాపారులను అడిగి వారి సమస్యలు తెలుసుకుని సకాలంలో అద్దె చెల్లించాలని సమస్యలుంటే నేరుగా తనకు తెలియజేయవచ్చునని ఎస్పీ సూచించారు.

కాంట్రాక్టు నర్సులను పర్మినెంట్ చేయాలి

అరసవల్లి: వివిధ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు నర్సులందరినీ రెగ్యులర్ చేయాలని అసోసియేషన్ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు రిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో నిరసన చేపట్టారు. నర్సింగ్ విద్యలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ చేసినవారు ఉన్నారని, కోవిడ్ ముందు నుంచి వారు తమ సేవలను అందిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తప్పుడు నిర్ణయంతో ఏఎన్‌ఎంలకు, ఎంపీహెచ్‌డబ్ల్యూ పేరుతో నామమాత్రపు శిక్షణ ఇచ్చారన్నారు. శిక్షణ పొందిన 2112 మంది సచివాలయ ఏఎన్‌ఎంలకు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ ఆసుపత్రుల్లో స్టాఫ్ నర్సులుగా నియమిస్తూ 115 జీవో జారీ చేసిందన్నారు. ఈ జీవో వల్ల రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న సుమారు 6,200 మంది నర్సులు నష్టపోతున్నారని, ప్రభుత్వం తక్షణమే ఈ జీవోను రద్దు చేసి, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆక్రమణకు గురవుతున్న ఫైరింగ్ రేంజ్ స్థలం

ఎచ్చెర్ల: సంతశీతారాంపురం పంచాయతీ చినరావుపల్లి సమీపంలో పోలీసు శాఖ కేటాయించిన ఫైరింగ్ రేంజి స్థలం ఆక్రమణలకు గురవుతుంది. ఫైరింగ్ రేంజ్‌కు 6.87 ఎకరాల స్థలాన్ని కొన్నేళ్ల కిందట కేటాయించారు. ఈ స్థలంలో జిల్లాలోని పోలీసు సిబ్బంది ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తుంటారు. ఈ స్థలానికి సంబంధించి పూర్తి స్థాయిలో హద్దులు లేకపోవడంతో కొంత భాగాన్ని కొందరు ఆక్రమించుకున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. పూర్తిస్థాయిలో హద్దులు నిర్ణయించకపోతే ఆక్రమణలు మరింత జరిగినా ఆశ్చర్యపోవాల్సినపనిలేదు. ఈ విషయమై ఆర్మ్‌డ్ డీఎస్పీ శేషాద్రి వద్ద ప్రస్తావించగా, ఈ విషయాన్ని జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌కు తెలియజేసి, ఆయన ఆదేశాల మేరకు ఆక్రమణల తొలగింపునకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్య సాయం అందించేందుకు కృషి చేస్తా


సాయాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: బోన్‌మారో వ్యాధితో బాధపడుతున్న ఆమదాలవలస మండలం, కుద్దిరాం గ్రామానికి చెందిన అల్లు హరి కుమార్తె భవానికి వైద్య సాయం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు శ్రీకాకుళం మున్సిపల్ కాంట్రాక్టర్లు, వారి స్నేహితులు కలిసి రూ.75,500 ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా ఆ పాప తల్లిదండ్రులకు తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్యానికి రూ.20లక్షలు అవసరమని, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మిగతా నిధులను సమకూర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక జడ్పీ ఎదురుగా గల హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి విభూతి సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్ పాల్గొన్నారు. కూటమి నాయకులు శవ్వాన ఉమామహేశ్వరి, అంబటి లక్ష్మీరాజ్యం, శ్రీనివాసరావు, కుమార్, రెడ్డి గిరిజాశంకర్, శ్రీకాంత్ వర్మ, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

- **ఆమదాలవలస:** పట్టణంలోని మెణింగివారివీధిలో డీసెవెన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భవిత స్కూల్ ఆవరణలో భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు మూడు వేల మంది భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. శనివారం వినాయక నిమజ్జనోత్సవం నిర్వహించనున్నట్టు డీసెవెన్ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు బ్యాంక్ ఖాతాలు

ఇచ్ఛాపురం: ప్రతీ విద్యార్థికి బ్యాంక్ ఖాతా అవసరమని కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరేంద్రకుమార్ పట్నాయక్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో విశాఖ గ్రామీణ బ్యాంక్ అధికారులు వచ్చి 9, 10 తరగతి చదువుతున్న 62మంది విద్యార్థులతో జీరో అకౌంట్ ఖాతాలు చేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. బ్యాంక్ ఖాతాల కోసం విద్యార్థులు బ్యాంకు చుట్టూ తిరగకుండా ఉండేందుకే బ్యాంకర్స్ ఈ అవకాశం కల్పించారన్నారు. బ్యాంక్ మేనేజర్ కృష్ణ, అకౌంటెంట్ శ్రీనివాస్, బ్యాంక్ మిత్ర సీఎస్‌పీ వి.తులసి పాల్గొన్నారు.

దీపారాధన



దీపారాధనలో భక్తులు

పొందూరు: మండల కేంద్రం వెంకటేశ్వర కాలనీలో గణేశ్ మండపం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన దీపారాధనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలు ఆకారాల్లో దీపాలను వెలిగించారు.


సంతబొమ్మాళి: బోరుభద్ర హైస్కూల్‌లో హిందీ 'అ' అక్షరం ఆకృతిలో..


పలాస: బ్రాహ్మణతర్లా పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

ఘనంగా హిందీ దివస్



నరసన్నపేట: హిందీ దివస్ ఆంగ్ల అక్షరాలతో..

జిల్లా వ్యాప్తంగా హిందీ దివస్ శుక్రవారం వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. బహుళ భాషలు గల భారత దేశంలో ప్రజలందరినీ ఏకతాటిపై తెచ్చి జాతీయ సమైక్యతకు ప్రతీకగా హిందీ భాష నిలిచిందని పలువురు వక్తలు అన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం


పోలాకి: విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ఏఎస్పీగా శ్రీనివాసరావు


ఎస్పీని కలిసిన ఏఎస్పీ

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో నేర నియంత్రణకు కృషి చేస్తామని శ్రీకాకుళం క్రైమ్ ఏఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. కాశీబుగ్గ డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇటీవల ఏఎస్పీగా పదోన్నతి లభించడంతో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీసు యంత్రాంగం పనిచేస్తుందన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

మెప్మా పీడీగా రమణ


రమణ

శ్రీకాకుళం కలెక్టరేట్: మెప్మా పీడీగా అదే కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న ఎస్వీ రమణ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన కిరణ్ కుమార్ బదిలీ అయింది. దీంతో రమణ శుక్రవారం మెప్మా పీడీగా బాధ్యతలు స్వీకరించారు.

భూ క్రయవిక్రయాలు చేయొద్దు

కంచిలి: బొగాబెణి పంచాయతీ పరిధిలో వేసిన వెంచర్‌లో భూ క్రయవిక్రయాలు చేయొద్దని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గ్రామాల్లో శుక్రవారం దండోరా వేయించారు. మండలంలోని 31 పంచాయతీల పరిధిలోని గ్రామల్లో రెవెన్యూ సిబ్బంది దండోరా వేశారు. మహల్పడా వద్ద వేసిన వెంచర్‌కు ఎటువంటి అనుమతులు లేవని, వీటికి సంబంధించి క్రయవిక్రయాలు చేస్తే వారే బాధ్యత వహించాల్సి ఉందని తెలిపారు. ఆ వెంచర్ భూ ములు రిజిష్ట్రేషన్ చేయొద్దని సోంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి నోటీసులు జారీ చేశామన్నారు.

ఎచ్చెర్ల ఎస్ఐగా సందీప్


ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఐ

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం, కళాశాలల్లో ర్యాగింగ్ నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును ఆయన క్యాంప్ కార్యాలంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన విజిలెన్స్ ఎస్పీ


కలెక్టర్‌తో విజిలెన్స్ ఎస్పీ

శ్రీకాకుళం కలెక్టరేట్: విజిలెన్స్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బర్ల ప్రసాద్ శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు.

జపాన్‌లో నర్సు ఉద్యోగాలకు శిక్షణ

ఎచ్చెర్ల: ఏపీఎస్ఎస్‌డీసీ, నావిస్ హెచ్ఆర్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం/జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి జపనీస్ భాష ఎన్-5, ఎన్-5, ఎన్-3 స్థాయిల్లో నేర్పించి వారికి జపాన్‌లో నర్సులుగా ఉద్యోగావకాశాలు కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 20-32 ఏళ్ల లోపు వయసు కలిగి, జపాన్‌లో పనిచేసేందుకు ఆసక్తి కలిగి ఉండాలన్నారు. బెంగళూర్‌లోని నావిస్ హెచ్ఆర్‌లో ఆరు నెలల శిక్షణ ఉంటుందన్నారు. మొత్తం శిక్షణ ఫీజు రూ.3.5 లక్షలు కాగా, పాక్షిక రుసుం రూ.50 వేలు అని చెప్పారు. పాక్షిక రుసుంలో ఏపీఎస్ఎస్‌డీసీ రూ.25 వేలు చెల్లిస్తుందని, మిగిలిన 25 వేలను అభ్యర్థి చెల్లించాలన్నారు. అలాగే రూ.3 లక్షల శిక్షణా ఫీజు చెల్లింపునకు సంస్థ బ్యాంకు రుణం సదుపాయం కల్పిస్తుందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత జపాన్‌లో ఉద్యోగాల కల్పనకు ఏపీఎస్ఎస్‌డీసీ నావిస్ హెచ్ఆర్ సంస్థ పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారికి నెలకు రూ.1,10,000 నుంచి రూ.1,40,000 వరకు జీతం ఉంటుందన్నారు. మరిన్ని వివరాల 99888 53335, 77801 67645 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

వీఆర్‌లోకి శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం రూరల్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వాసుదేవరావును శుక్రవారం వీఆర్‌లోకి పంపించారు. ఈ మేరకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 2024 ఎన్నికల నేపథ్యంలో విశాఖ నుంచి బదిలీపై వచ్చిన వాసుదేవరావుకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఇంకా ఎవర్ని నియమించలేదు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు

ఎచ్చెర్ల: పొన్నాడ పీహెచ్‌సీ పరిధిలోని దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో విద్యార్థులకు హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు శుక్రవారం ఆరోగ్య తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు, విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షకుడు ఆర్.సురేంద్ర, ఆశ కార్యకర్త లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

కబేళాకు గేదెల తరలింపు

- పట్టుకున్న పోలీసులు

పలాస: కబేళాకు తరలిస్తున్న గేదెలను కాశీబుగ్గ పోలీసులు పట్టుకొని విజయ నగరం జిల్లా కొత్తవలస పశుసంరక్షణ కేంద్రానికి తరలించినట్టు సీఐ డి.మోహనరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. సున్నాదేవి జంక్షన్ వద్ద హైవేపై శుక్రవారం మధ్యాహ్నం ఏఎస్ఐ సంజీవరావు, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వ్యాన్ వెళ్తుండగా.. దాన్ని నిలుపుదల చేసి తనిఖీ చేశారు. జాడుపూడి వద్ద గేదెలను కొనుగోలు చేసి కబేళాకు తరలిస్తున్నట్టు విచారణలో గుర్తించారు. గేదెలను తరలిస్తున్న ఆవాల ఉమామహేశ్వరరావు, ఆదాడ సూర్యనారాయణలను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

టేకు చెట్ల నరికివేతపై దర్యాప్తు

బూర్జ: తోటవాడ పంచాయతీ పరిధి కొల్లివలస సమీపంలోని ఓ రియల్ ఎస్టేట్‌లో యథేచ్ఛగా టేకు చెట్లు నరికివేస్తున్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖాధికారులు శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి దర్యాప్తు చేశారు. రియల్ ఎస్టేట్ నిర్వాహకులు చెట్లు నరికివేతపై అనుమతులు తీసుకున్నారా? లేదా? తదితర విషయాలపై ఆరా తీస్తున్నట్టు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సాయికుమార్ తెలిపారు. రియల్ ఎస్టేట్‌లో టేక్ చెట్లను నరికివేయడంపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.